

# "తానొకటి తలిస్తే"

రచయిత: రావిపల్లి నారాయణరావ్

"చలి....చలి....చలి....ఎలా పడుకోవటం? వళ్లు వణుకుతుంది. పళ్లు బిగుసుకుంటున్నాయి. నిద్రపట్టకుంటుంది. వెధవ చలి - వెధవవూరు" తిట్టుకున్నాడు ప్లాటుఫారంమీద దొర్లుతూ పాపయ్య. అటు తిరిగేడు యిటు తిరిగేడు. చలి అతన్ని నిద్ర పోనీయటంలేదు. బోరున చలిగాలితో వర్షం కురుస్తుంది. రొజ్జ ప్లాటుఫారంమీదకి కొడుతూ చలిని మరింతరెచ్చకొడుతుంది. ఎద్దుపుండుపై కాకి పొడిచినట్టయింది పాపయ్యపరిస్థితి.

అది అతని స్వంతవూరే. కాని తెలిసిన వాళ్లెవ్వరు తలదాచుకోటానికి కూడ స్థలమివ్వరు తనకి. స్టేషన్‌మాష్టరు కొత్తవాడవబట్టి ప్లాటుఫారంమీదైన పడుకోటానికి అవకాశం కలిగింది పాపయ్యకు. యాభై సంవత్సరాల తన జీవితంలో అతను ఆ వూరిలో యిరవై సంవత్సరాలు కూడ లేడు. పుట్టిన వూరని అతనికి మక్కువ యేమిలేదు. కాని తన చిన్నతనంలో ఆ వూరిలో ఒక గుడిసె వుండటం తనకు గుర్తుంది. మిగతా జీవితాన్ని తన స్వంతగుడిసెలో హాయిగా గడపవచ్చని పాపయ్య ఆ వూరు వచ్చాడు. ఆ వూరు విడచి చాలాకాలమయింది, ఇప్పుడా ప్రదేశం చాలా కొత్తగా కనిపిస్తుంది తనకి. అప్పుడున్న యిళ్లేవి? తన గుడిసె యేమైంది? వెతికేడతను. అయిళ్లన్ని పెద్దభవనాలయాయి. తన గుడిసెజాడ కనపడలేదు. నిరాశతో ప్లాటుఫారంమీద పారా కాసాడు.

పదిరోజులు ప్లాటుఫారం జీవితం గడిపేసరికి అతనికి జీవితంపై విరక్తి కల్గింది. వెధవప్రపంచం, వెధవబ్రతుకు అనుకున్నాడు. చేతిలో ఒక పైసాకూడలేదు. కంటికి నిద్ర కరువయింది. కడుపుకు అన్నం అనసలేదు. యీ వూరిలోకాదు, యీ ప్రపంచంలోకూడ వుండకూడదు అనుకున్నాడు. "ఎక్కడికి పోతాను? నాపేరు వింటే పది ఫర్లాంగులు పరిగెత్తే యీలోకం సన్మానిస్తుందా?" అని ఆలోచించేడు. బయట బ్రతుకుకన్నా గడచిన యిరవై సంవత్సరాల జైలుజీవితం ఎన్నో రెట్లు మేలనిపించింది. కడుపునిండకపోయినా ఆకల్ని చంపే కూడు దొరక్కపోదు అనుకున్నాడు. ఎలాగైనా మళ్ళా జైలుకుపోవాలనిపించింది పాపయ్యకు. పోలీసులు కంటబడితే తప్పక కొట్లోవేస్తారు అని తలచి పోలీసు స్టేషనుచుట్టు తిరగటం మొదలుపెట్టాడు. నేరంచేయకుండా కొట్లో వేయరన్న విషయం తెలియని పాపయ్యప్రయత్నం విఫలమైంది.

వర్షం తగ్గలేదు. రొజ్జ ప్లాటుఫారంమీదకి కొడుతూనేవుంది. వచ్చేట్రైన్లు వస్తువున్నాయి, పోయే ట్రైన్లు పోతూవున్నాయి. ప్లాటుఫారంమీదనున్న చమురు లాంతరు గుడ్డివెలుతురులో పాపయ్య పరిశీలిస్తున్నాడు. ప్లాటుఫారంమీద చలితో బాధపడి దొర్లుతూ జైలుకు పోయేమార్గంగురించి అతను ఆలోచించాడు. "జైలుకుపోటానికి ఇంత ఆలోచనా? ఖూనీ చేస్తే చాలదూ? జైలులో పడ్డానికి" అని అతని మెదడుకు తట్టకపోలేదు. ప్రజలకు బాధకలిగే భారాన్ని అతను భరించలేదు. అందుకే అతను అంత తీవ్రంగా ఆలోచించాడు. అతనిదృష్టి బుకింగ్‌ఆఫీసువైపు పోయింది. అక్కడ వందలాది జనం వరుసగా నిలబడ్డారు టిక్కట్ల కోసం. ఆచిన్నస్టేషన్‌లో అంతమంది టిక్కెట్లకోసం నిలబడ్డం అతనికి ఆశ్చర్యం కలిగింది. వాళ్లమాటలనుబట్టి ఏదో యాత్రకు పోతున్నారని అతను తెలుసుకున్నాడు. అతనికి మెరపులాంటి ఆలోచనతట్టింది. తనుకూడ క్యూలో నిల్చున్నాడు టిక్కట్టు కొనేవాడికిమల్లే. క్యూలో నిల్చున్నాడే కాని, అతనికళ్లు తన ముందు నిల్చున్నవాని పర్సుపై పరిగెత్తేయి. ఆ పర్సు గ్లాస్కోలాల్చి పక్కజేబులో నల్లగా తళతళలాడుతుంది. క్యూ చేంతాడులాపెరుగుతుంది. క్యూలో కొట్లాట ప్రారంభమైంది. పోలీసులు జనాన్ని వరుసగానిలబెడుతున్నారు. పాపయ్యదృష్టి మరోవైపు పోనిచ్చి చేతితో ముందు వాడిజేబు తడిమేడు. పర్సు చేతికి తగల్లేదు. ముందు వాడివైపుచూచేడు. ముందు నిల్చున్న వాడు పర్సు దులుపుతున్నాడు టిక్కెట్టు డబ్బులుకోసం. అదిచూచి "టిక్కెట్టు డబ్బులే వేసుకు వచ్చాడన్నమాట" అనుకున్నాడు పాపయ్య. కాస్త ముందుగా పని కానిస్తే తననుకున్నపని నెరవేరేది అనుకున్నాడతను. "చేంతాడులా మనముందు ఇంతమంది వుండగా యిప్పటినుండి డబ్బులు చేతిలో వేసుకోవటం దేనికి? డబ్బులు రాలిపోగలవు!" అన్నాడు పాపయ్య ముందువానితో తిరిగి డబ్బులు పర్సులో వేయకపోతాడా అని.

"అసలే నాకు మతిమరపు యెక్కువ. టిక్కెట్టుతీసుకొని డబ్బులు యివ్వటం మరచిపోతాను" అని అతను చెప్పే సమాధానం విని యితడెవడో నాకంటె ఘనుడులావున్నాడు అనుకున్నాడు పాపయ్య. ట్రైన్ వచ్చింది టిక్కట్టు దొరకినవారంతా బండి యెక్కేరు. బండివెళ్లిపోగా టిక్కట్టు దొరకని వారంతా ముఖాలు ముడుచుకుని యిళ్లముఖంపట్టేరు. నిర్మానుష్యంగావుంది ప్లాటుఫారం. స్టేషన్‌లోని గడియారం రెండు గంటలు కొట్టింది. మరేమి బళ్ళురావనుకున్నాడు పాపయ్య. స్టేషను అవతలవైపు చూచేడు. ఉరుములు, మెరుపులతో కారుమేఘాలనుండి వర్షం విపరీతంగా కురుస్తుంది. గాలికి ప్లాటుఫారంమీది చమురుదీపం రెపరెపకొట్టుకుంటుంది. ప్లాటు

ఫాంమీద ఇటు అటు తిరుగుతూవున్నాడు పాపయ్య యేమి తోచక. అక్కడ అతనుతప్ప మరెవరు లేరనుకున్న పాపయ్యదృష్టికి ప్లాటు ఫాం చివర ఒకడు పెట్టిప్రక్క కూర్చొని వుండటం కనిపించింది. రైలుతప్పేడుగాబోలు అనుకున్నాడు పాపయ్య. జైలుకు పోవాలంటే యిదే అదనని అతనిపెట్టి తీసుకుని అక్కడ నిల్చున్నాడు. పెట్టి దగ్గర కూర్చున్నవాడు పాపయ్యవైపు ఆశ్చర్యంగా చూచేడు.

"ఏమయ్యా! అలా కళ్లప్పగించిచూస్తావేం? పోలీసుకు రిపోర్టుచేస్తావా? చేయ్. అలాచూస్తు



కూర్చుంటే యేం ప్రయోజనం?" అన్నాడు పాపయ్య.

"బాబు క్షమించండి! అది మీ పెట్టని నాకు తెలీదు. రెండు గంటలక్రిందట దారిలో ఒకతను కనబడి ఆ పెట్టి నాచేతి కిచ్చేడు. స్టేషనుదగ్గర నన్నుండమని చెప్పి తనెక్కడకో పోయాడు. దీనిలో నా తప్పేమి లేదు' నన్ను క్షమించండి! నన్నేమి అనకండి" అని చెప్పి పెట్టిగలతను పరుగులంకించుకున్నాడు. వీడెవడో నా మిత్రుడులా వున్నాడు అనుకున్నాడు పాపయ్య. తానొకటి తలిస్తే వేరొకటయింది. అతను పోలీసుకు రిపోర్టుచేస్తాడు; అప్పుడు జైలుకుపోవచ్చు అనుకున్నాడతను. కాని వాడెవడో పత్తాలేకుండా పరుగు లంకించుకుపోయాడు. ఆ పెట్టిని యేమి చేయటం అని ఆలోచించాడు పాపయ్య. అతనికి మెరపు లాంటి ఆలోచన తట్టింది.

తెల్లవారింది వర్షం వెలసింది. ఆరుగంటలయింది. పోలీసు స్టేషన్ముందు పెట్టెతో ప్రత్యక్షమయాడు పాపయ్య. ఆతని రాకను సబ్ యిన్స్పెక్టర్ గమనించాడు.

"పాపయ్య యేం యింత పెందలికాడే వచ్చేవ్? మరేం వింతలు లేవు గదా!" అని అడిగేడు సబ్ యిన్సపెక్టర్.

"బాబు క్షమించండి! రాత్రి ఒక యింట్లో చోరీచేసాను యీపెట్టిని. బుద్ధిగడ్డితినిచేసాను. యీసరికి జైలుకు పంపించండి. మరెప్పుడు ఇలాంటిపనులు చేయను. మీ మేలు మరువను" అని వేడుకొని పెట్టిని సబ్ యిన్స్పెక్టర్ టేబిలుపైన పెట్టేడు పాపయ్య.

పెట్టిని చూచేక సబ్ యినస్పెక్టరుకు ఆశ్చర్యం ఆనందం కలిగేయి. ఆ పెట్టి సర్కిల్ యినస్పెక్టర్గారింట్లో క్రిందటిరాత్రి 12 గంటలకు దొంగలింపబడింది. ముద్దాయి దొంగతనం జరిగిన అరగంటలోనే పట్టుబడ్డాడు. నేరానికి వొప్పుకొన్నాడు కూడ. కాని వస్తువు దొరకలేదు. "ప్రాపర్టి లేకండా కేసు ఎలా పెట్టడం? కేసు పెట్టకపోతే యిన్స్పెక్టరుగారి చీవాట్లు తప్పవు" అని రాత్రంతా నిద్ర లేకుండా ఆలోచిస్తున్న సబ్ యినస్పెక్టర్ గార్కి తెల్లవారేసరికి పాపయ్యను, ఆపెట్టెను చూడగానే ఆశ్చర్యం ఆనందం కలిగాయి. రాత్రి దొంగతనం జరిగేవేళకు పాపయ్య స్టేషనులో బుకింగ్ఆఫీసువద్ద నున్నట్టు బీట్ కాన్స్టేబిల్ద్వారా తెలుసుకున్నాడు. చేయని నేరాన్ని నెత్తిపైని వేసుకోవటం జైలుకుపోవాలన్న వుద్దేశమే నని తెలుసుకోటానికి సబిన్స్పెక్టరుకు అట్టే కాలంపట్టలేదు.

"పాపయ్య నీకు జైలుమీద మక్కువ తగ్గలేదనుకుంటాను. గడచిన పది రోజులు నీవు యీ స్టేషన్చుట్టు ఎందుకు తిరుగుచున్నది నాకు అప్పుడే అర్థమైంది. విడుదలైన ఖైదీలను మేము కనిపెడ్తుండాల్సింది. కాని నీవే మమ్మల్ని కనిపెడుతున్నావు. చేయని నేరాన్ని నెత్తిమీద రుద్దుకుంటున్నావు. యీ దొంగ రాత్రే మా వశం అయ్యాడు నేరానికి వొప్పుకున్నాడు. కాని పెట్టె ఎవరి చేతికో అందచేయటంవలన మాకు దొరకలేదు. నీవు జైలుకు ఎందుకు పోవాలని చూస్తున్నావో నాకు అర్థమైంది. నీ మంచితనాన్ని కనిపెట్టి నిన్ను మా స్టేషన్ తోటమాలిగా నియమిస్తున్నాను" అని సబ్యినస్పెక్టర్ చెప్పగా పాపయ్యకళ్లనుండి ఆనంద బాష్పాలు రాలాయి.

★


# కస్తూరి మాత్రలు

జలుపు, సాధారణ శీతలముచేత దగ్గులు, జ్వరము, గొంతులో కరకరమని యుండుట తల భారము మొదలగువాటిని పోగొట్టును. ఈమాత్రలు బిడ్డలుమొదలు వృద్ధులువరకు ఎంత వయస్సుండినను వాడుకోవచ్చును.

25 మాత్రలు గల బుడ్డి 1-కి రు. 1=00

తపాలా చార్జి రు. 1=12

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్ పెట్టె నెం. 1376, మద్రాసు-1.